శ్రీకృష్ణ ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట: శ్రీకృష్ణ భగవానుడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం పట్టణ శివారులో శనివారం కనులపండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో రుత్వికులు ప్రత్యేక పూజలతో ధ్వజస్తంభాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఆదివారం నిర్వహించే శ్రీకృష్ణ పరమాత్ముడి విగ్రహావిష్కరణతో పాటు నవగ్రహ, ద్వారపాలకుల విగ్రహ ప్రతిష్ఠకు సర్వం సిద్ధం చేశారు. మూడు రోజులుగా దేవాలయ ప్రాంగణం అంతా భక్తులతో భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు పాల్గొని శ్రీ కృష్ణ భగవానుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వేద పండితులు, అఖిల భారత అయ్యప్ప సేవకులు బ్రహ్మశ్రీ గోపాలకృష్ణ గురుస్వామి, మన్నె జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, గొల్లబాబు, పల్లెపాగు ప్రశాంత్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

వనపర్తి రూరల్: మండలంలోని మెంటెపల్లి పంచాయతీ పరిధిలోని రాఘవేంద్రకాలనీలో నిర్మించిన బంగారు మైసమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి పాల్గొన్నారు.


కొత్తకోటలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


మెంటెపల్లిలో జిల్లెల చిన్నారెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

ఆత్మకూర్: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. పదో తరగతి అనంతరం విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని అధ్యాపకులు కోరారు. శనివారం డీఐఈఓ అంజయ్య, ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి సూచన మేరకు స్థానిక ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు కురుమూర్తి, బుచ్చయ్య అమరచింత, ఆత్మకూర్, చిన్నచింతకుంట మండలాల్లో పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కల్పిస్తున్న వసతులపై ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలుగు, ఆంగ్లంలో విద్యాబోధనలు జరుగుతున్నాయని, ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈసందర్భంగా పది విద్యార్థులకు పెన్నులు అందజేసి ప్రైవేట్ కళాశాల్లో చేరి తల్లిదండ్రులకు ఆర్థిక భారం కలిగించకుండా మెరుగైన విద్య అందుతున్న ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచించారు.


విద్యార్థులకు పెన్నులు అందిస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ భూమి కాపాడాలంటూ ఆందోళన

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని క్రీడా ప్రాంగణం స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి విజయరాములు, రాష్ట్ర కమిటీ సభ్యుడు పయ్యాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్ మాట్లాడుతూ.. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు భూమిని సేకరించి పట్టాలు ఇచ్చి 8 గుంటల భూమిని ప్రజల అవసరాల నిమిత్తం ఖాళీగా ఉంచిందన్నారు. మూడేళ్ల క్రితం ఆ స్థలంలో ప్రభుత్వం క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి చుట్టూ మొక్కలు నాటారన్నారు. ప్రభుత్వం స్థలంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం బోర్డు, చెట్లను రెండు రోజుల క్రితం దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయంలో అధికారులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, రమేష్, బాలస్వామి, కుర్మయ్య, పెంటయ్య, హన్మంతు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

మండలంలోని తెల్లరాళ్లపల్లి క్రీడా ప్రాంగణంలో చెట్లను, బోర్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎస్‌ఐ శ్రీనివాస్ కు వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల అండతోనే దుండగులు క్రీడా ప్రాంగణం చెట్లు, బోర్డును ధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడుతూ.. చెట్లు, బోర్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అన్వేష్, ప్రవీణ్, శివరాంయాదవ్, నరేందర్‌రెడ్డి, రమేష్, నాగరాజు, మల్లేష్, దినేష్, శివరాజు, మద్దిలేటి పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ఉన్నత చదువులపై దృష్టి సారించాలి

కొత్తకోట రూరల్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నిర్వహించిన పాఠశాల 20వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం తాను ఎల్లవేళలా కృషి చేస్తున్నానని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి లక్ష్మీదేవమ్మ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు వెంకటస్వామి, రమేష్‌గౌడ్ మాజీ సర్పంచ్‌లు వెంకటస్వామి, శ్రీనివాసరెడ్డి, నాయకులు టైలర్ రవి, రాధాకృష్ణ, బుచ్చన్న, చెన్నమ్మ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

విద్యుత్ స్తంభాల కేటాయింపుపై హర్షం

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో రైతులకు అత్యవసరంగా వినియోగించుకునేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు అధికారులు 20 విద్యుత్ స్తంభాలను కేటాయించడంపై నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ, రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని పలు రోడ్లు, తాగునీటి వసతులు, విద్యా అవసరాలను గుర్తించి మంత్రి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొస్తానని నర్సింహ తెలిపారు.

పట్టణ పరిశుభ్రతే ముఖ్యం

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని ఓపెన్ ప్లాట్లలో పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను ప్లాట్ల యజమానులు తొలగించుకోవాలని పుర కమిషనర్ చికినె శశిధర్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు ఉన్నాయని అందులో చెత్తాచెదారం చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, దోమలు వ్యాప్తి చెందకుండా అందరూ కృషి చేయాలని కోరారు. అలాగే పట్టణంలోని వ్యాపారస్తులు తమ దుకాణా సముదాయాలకు సంబంధించిన లైసెన్సులను తీసుకోవాలని, పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వనపర్తి రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకుని కేసు నమోదు చేశామని వనపర్తి పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని మెట్టుపల్లి వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టణంలోని కమలానగర్ వద్ద బీట్ తిరుగుతున్న పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ ఇసుక తరలింపునకు సంబంధించిన పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ కమ్ ఓనర్ మదిగట్ల రాజుకుమార్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టరును సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు నిర్మాణంతో తొలగనున్న ఇబ్బందులు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ నుంచి కంబాళాపురం క్రాస్ రోడ్డు వరకు నిర్మించే బీటీ రోడ్డుతో ఆయా గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలుగుతాయని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. శనివారం బీటీ రోడ్డు నిర్మాణం పనులను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధ్వాన్నంగా ఉన్న రోడ్డు గురించి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన 4.100 కిలోమీటర్ల రోడ్డుకు నిర్మాణానికి రూ.2.85 కోట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్యసాగర్, జయరాములుసాగర్, నాయకులు తెలుగురాజు, నగేష్, నరేష్, బాలరాజు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

సీఆర్పీలకు ఘన నివాళి

ఖిల్లాఘనపురం: మెదక్ జిల్లాకు చెందిన సీఆర్పీలు విధులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి చిత్రపటాలను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద ఏర్పాటు చేసి ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతిచెందిన సీఆర్పీల అంతిమ యాత్రలో పాల్గొనేందుకు వెళ్లిన ఎస్‌ఎస్‌ఏ సిబ్బందిని అక్రమంగా అరెస్టు చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది వెంకటేష్, పవన్, అర్జున్, రజిత తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ప్రయాణ ప్రాంగణం నిర్మించరా?


బస్టాండ్ లేకపోవడంతో రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)

- బస్టాండు కోసం ఎదురుచూపులు
- బస్సుల కోసం ఎండలోనే నిరీక్షణ

మదనాపురం: మండల కేంద్రంలో బస్టాండు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంగా ఏర్పడి కూడా ఏళ్లు గడుస్తున్నా నేటికీ బస్టాండు నిర్మాణానికి నోచుకోకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాడు రెండో ముంబైగా వ్యాపారపరంగా పేరొందిన ప్రాంతమిది. ప్రతిరోజు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ పనుల నిమిత్తం వందల సంఖ్యలో మండల కేంద్రానికి వస్తుంటారు. ఇక్కడి నుంచి హైదరాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, ఆత్మకూర్, అమరచింత, కొత్తకోట, దేవరకద్ర తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతోపాటు వనపర్తి జిల్లా కేంద్రానికి ప్రధాన రైల్వే స్టేషన్ ఇదే కావడంతో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కానీ బస్టాండు లేకపోవడంలో బస్సులు వచ్చే వరకు చౌరస్తాలో, హోటళ్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రయణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వానకు, ఎండాకాలంలో ఎండకు ఇబ్బందులు పడుతూ రోడ్లపైనే నిల్చోవాల్సి వస్తుందని వాపోయారు. బస్టాండు నిర్మాణంపై ఈ ప్రాంత ప్రజల్లో ఉన్న ఆశ నిరాశగానే మిగిలింది.

మార్కెట్ స్థలంలో..

నూతన బస్టాండ్ నిర్మాణం కోసం స్థానిక మార్కెట్ స్థలాన్ని అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించి బస్టాండ్ నిర్మాణం చేయాలని వినతిపత్రాలు సమర్పించారు. కానీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి బస్టాండు నిర్మాణంపై చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుపైనే..

మండల కేంద్రానికి వస్తే బస్టాండు లేకపోవడం వలన టీ హోటళ్లు, ప్రధాన రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి. బస్టాండు నిర్మాణంపై పాలకులు దృష్టి పెట్టాలి. బస్టాండు లేకపోవడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు.

– మొగిలి, అజ్జకొల్లు

గిరిజన సంస్కృతిని పరిరక్షిద్దాం

సాక్షి, నెట్‌వర్క్: సంత్ సేవాలాల్ మహారాజ్ సేవలు ఉన్నతమైనవని, ఆయన వ్యక్తిత్వం భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం సంత్‌సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం గిరిజన యువకులు, మహిళలు డప్పు వాయిద్యాలకు నృత్యాలు చేస్తూ సంత్ సేవాలాల్ చిత్రపటాలను ఊరేగించారు.

● అమరచింత పట్టణంలో గిరిజన యువకులు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై.. సేవాలాల్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. మండలంలోని చంద్రనాయక్‌తండాలో సంత్‌సేవలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, గిరిజనులు పాల్గొన్నారు.

● కొత్తకోట మండలంలోని నాటవెల్లిపెద్దతండా, ఒట్లంపూడితండా, జయరాంతండాల్లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ఎద్దుల నాగేష్, ఆకుల శ్రీనివాసులు, లక్ష్మణ్‌నాయక్, గోపాల్‌నాయక్, నెహ్రూ, గిరిజనులు తదితరులు ఉన్నారు.

● వనపర్తి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, పెద్దిరాజు, కృష్ణగౌడ్, రామకృష్ణ, నవీన్, రాయన్న, విజయ్‌సాగర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూర్ మండలంలోని బాలకిష్టాపూర్, బాప్‌సింగ్‌తండా, బొగ్గులోనితండాకు చెందిన గిరిజనులు సేవాలాల్ ఉత్సవాలను పురస్కరించుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్‌లో సంత్‌లాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రంలో తుకారాం నాయక్, అనిత, గాంగ్యా, రమేష్, సుభాష్, డాక్య, అశోక్, రవి, శివ, కిషన్, సీతారాం, బాబు, రాంచందర్ పాల్గొన్నారు.


నర్సింగాపురంతండాలో సేవాలాల్‌కు పూజలు చేస్తున్న గిరిజనులు

● మదనాపురం మండలంలోని నర్సింగాపురంతండాలోని సేవాలాల్ ఆలయంలో ఆయన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● వనపర్తి మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ అధ్యక్షతన సంత్ సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రమదేవి, వరదాచారి, మహ్మద్‌షఫీ, రవి, శ్రీనివాసులు, స్వరూప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, అన్నారంతండాల్లో సేవాలాల్ చిత్రపటాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, బాబునాయక్, మాజీ సర్పంచులు శాంతమ్మ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఖిల్లాఘనపురం మండలంలోని మామిడిమాడ తండా నుంచి గిరిజన యువకులు సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, అల్లమాయపల్లి, రోడ్డుమీది తండాల మీదుగా మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండు వద్ద సేవాలాల్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజునాయక్, రవినాయక్, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.


నాటవెల్లిపెద్దతండాలో..


బాలకిష్టాపూర్‌లో..


అమరచింతలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి


బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద..

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం



కొత్తకోట రూరల్: కుటుంబ కలహాలతో ఓ మహిళ చెరువులో దూకడంతో సమీపంలో ఉన్న యువకులు కాపాడి సీపీఆర్ చేసి కాపాడిన ఘటన మండలంలోని కానాయపల్లి శివారులో గల శంకరసముద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. కానాయపల్లికి చెందిన అరుణను పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాములు కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు సంతానం. కొంతకాలంగా కుటుంబంలో కలహాలు ఉండటంతో విసుగు చెందిన అరుణ శనివారం మధ్యాహ్నం కానాయపల్లికి వెళ్తున్నానని చెప్పి వచ్చి గ్రామ సమీపంలో గల శంకరసముద్రంలో దూకింది. సమీపంలో ఉన్న యువకులు వెంటనే గమనించి చెరువులో దూకి బాధితురాలిని బయటకు తీసుకొచ్చారు. నీళ్లు ఎక్కువగా మింగడంతో పాటు స్పహ కోల్పోవడంతో యువకులు శ్రమించి నీళ్ల బయటకు తీయడంతో పాటు సీపీఆర్ చేసి మహిళ ప్రాణాలను కాపాడి 108కు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది, పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న కొత్తకోట ప్రీమియర్ లీగ్



కొత్తకోట: పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న కొత్తకోట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రెండో రోజు కొనసాగాయి. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు శనివారం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు నవీన్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, గుంత శివ, రఘు, కార్తీక్, సాయి, సన్నీ, మహేష్, శివశంకర్, తరుణ్, గణేష్, అరుణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గిరిజా కల్యాణం



అమరచింత: మండల కేంద్రంలోని శ్రీకృష్ణానగర్‌లోని పాత శివాలయంలో శనివారం గిరిజా కల్యాణం కనులపండువగా నిర్వహించారు. శుక్రవారం శివ మహాపడిపూజ నిర్వహించిన మాలధారులు శనివారం గిరిజా కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. శివ, పార్వతుల ఉత్సవ విగ్రహాలతో వధువరులను భక్తులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ పూజారి జంగం శివానంద్, మాలధారులు పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి కృషి



అమరచింత: పట్టణంలోని యాదవ కమ్యూనిటీ హాల్‌లో శనివారం శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కమిటీని యాదవ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు మేస్త్రీ రాములు తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా జింక రవి, ఉపాధ్యక్షులుగా మధుగని విష్ణువర్ధన్ యాదవ్, విజయ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పి.రాజు, సహాయ కార్యదర్శులుగా నరసింహాయాదవ్, అంబటి రవికుమార్, కోశాధికారిగా కప్పల నాగరాజు, సభ్యులుగా వాటర్ శ్రీనివాస్‌యాదవ్, గొల్లబాబు, సైకిల్ వెంకటేష్, ముఖ్య సలహాదారులుగా ఆర్‌ఎన్ శంకర్, తిరుమలేష్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ యాదవుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

'అభివృద్ధి పనులు కొనసాగించండి'



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో ఐటీ టవర్ మంజూరు ముమ్మాటికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి ఉందని, భవిష్యత్ తరాల కోసం ఐటీ టవర్ వనపర్తికి దూరం కాకూడదని ప్రభుత్వంలో చొరవ చూపినట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కొనియాడారని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను వనపర్తిలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించేలా చిన్నారెడ్డి చొరవ చూపాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నందిమల్ల అశోక్, పరంజ్యోతి, ఉంగ్లం తిరుమల్, చిట్యాల రాము, జోహెబ్, రమేష్ పాల్గొన్నారు.

శనేశ్వరునికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరునికి ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి బారులు తీరి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్‌లోని శ్రీభూనీల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో చక్రస్నానంతో ముగిసినట్లు ఆలయ పూజారి శేషాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 6న ప్రారంభమై చక్రస్నానంతో ముగిశాయి. నెల రోజుల పాటు జాతర కొనసాగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.